నేడు బాలయేసు మహోత్సవం

● ఊరి పండగ పేరుతో ప్రసిద్ధి
● వేలాదిగా తరలిరానున్న క్రైస్తవులు

హయత్‌నగర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడలోని బాలయేసు పుణ్యక్షేత్రంలో ఆదివారం నుంచి వార్షిక మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ పుణ్య క్షేత్రాన్ని దర్శించుకునేందుకు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన లక్షలాది మంది క్రైస్తవులు హాజరు కానున్నారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి రెండవ ఆదివారం ఈ మహోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటారు. క్షేత్రం ప్రారంభమైన నాటి నుంచి క్రైస్తవులు నవ దిన ప్రార్థనలు చేస్తారు. స్థానిక కమ్మగూడ ప్రజలు ఈ పండగను(ఊరి పండుగగా) పిలుచుకుంటారు. పండగను పురస్కరించుకుని చర్చి కమిటీ నిర్వాహకులు అతిథుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. మహోత్సవాన్ని పురస్కరించుకుని చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ముఖ్యంగా దేవమాత గృహతో పాటు క్రీస్తు జీవిత వృత్తాంతాన్ని తెలిపే పవిత్ర భూమిలో ఏర్పాటు చేసిన మేరి మాత మందిరం, కలవారికొండ, ప్రతిమలు అందరిని విశేషంగా ఆకట్టుకుంటాయి. 9వ తేదిన జరిగే ఈ పండగకు వచ్చే క్రైస్తవులతో కమ్మగూడ, తుర్కయంజాల్ పరిసర ప్రాంతాలు జన సంద్రంగా మారుతాయి. ఆదివారం ఉదయం బాలయేసు మహోత్సవం ప్రారంభం అవుతుంది. ఉదయం నాలుగు గంటలకు ఫాదర్ తాతిరెడ్డి జయరాజ్, ఉదయం 5గంటలకు ఫాదర్ మాదాసు ఆరోగ్యస్వామి, ఉదయం 6గంటలకు బోయిగూడ నుంచి బాలయేసు తేరు ప్రదక్షిణ ఆరంభం అవుతుంది. ఉదయం 11.30 గంటలకు బాలయేసు మహోత్సవ దివ్య బలిపూజను తెలుగులో కార్డినల్ పూల అంథోని చేస్తారు.


కమ్మగూడలోని బాలయేసు పుణ్యక్షేత్రం

బోయిగూడ నుంచి బాలయేసు తేరు ప్రదక్షిణ ఆరంభం

ప్రతి సంవత్సరం బాలయేసు వార్షికోత్సవం రోజున హైదరాబాద్ నగరంలోని బోయిగూడ చర్చి నుంచి ఉదయం 6గంటలకు తేరు ప్రదక్షిణను ఊరేగింపుగా కమ్మగూడ చర్చికి తీసుకుని వస్తారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్‌తో పాటు కమిటీ సభ్యులు తేరుకు స్వాగతం పలుకుతారు.

క్రైస్తవ భక్తుల రాక

ఈ ఉత్సవాలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి క్రైస్తవ మత పెద్దలతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి మత గురువులు హాజరై బాలయేసును దర్శించుకుని స్వస్థతా ప్రార్థనలు చేస్తారు.

ప్రత్యేక బస్సు సౌకర్యం

క్రైస్తవులు ఎంతో పవిత్రంగా జరుపుకునే ఈ బాలయేసు వార్షిక మహోత్సవానికి టీఎస్ఆర్టీసీ నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి కమ్మగూడ, తుర్కయంజాల్‌కు ప్రత్యేక బస్సులు నడుపుతుంది. మహాత్మా గాంధీ బస్సు స్టేషన్, సికింద్రాబాద్ జూబ్లీ, దిల్‌సుఖ్‌నగర్, కోఠి, మెహిదిపట్నం, నాంపల్లితో పాటు మలక్‌పేట్ నల్లగొండ క్రాస్ రోడ్డు నుంచి చర్చి వరకు ప్రత్యేక బస్సులు నడిపిస్తారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేస్తారు.


ఆలయ ప్రాంగణంలో శిలువ పైన క్రీస్తు


ఆకట్టుకుంటున్న మథర్ థెరిస్సా విగ్రహం


మునగనూరు వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం వద్ద నిర్వహించిన హోమానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

హయత్‌నగర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ మునగనూరులో నూతనంగా నిర్మించనున్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దంపతులు, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి అనురాధారాంరెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి యాదిరెడ్డి దంపతులు శనివారం భూమిపూజ నిర్వహించారు. ఉదయం 4గంటలకు గణపతిపూజ, పుణ్యాహవచనం, సుదర్శన వాస్తు, నవగ్రహ, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం నిర్వహించిన హోమంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, మునగనూరు పరిసర గ్రామాలు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మునగనూరులో వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సుందరంగా నిర్మించనున్నట్లు తెలిపారు. స్థానిక మాజీ కౌన్సిలర్ వేముల స్వాతిఅమరేందర్‌రెడ్డి, నాయకులు గుత్త వెంకట్‌రెడ్డి, అంజయ్య, రమేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

బరేలీ గ్రౌండ్ సమస్య పరిష్కారానికి కృషి

● ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్

మన్సూరాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : నాగోల్ డివిజన్ రాక్‌టౌన్ కాలనీలోని పార్కుల సంరక్షణతో పాటు బరేల్ గ్రౌండ్ సమస్యను పూర్తి స్థాయిలో పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ పేర్కొన్నారు. ఈ సమస్యలపై కాలనీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు జీహెచ్‌ఎంసీ కమిషనర్, జెడ్సీలకు పలు మార్లు విన్నవించారు. వారి విజ్ఞప్తి మేరకు స్థానిక కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్ యాదవ్‌తో కలిసి జోనల్ కమిషనర్ శనివారం కాలనీకి వచ్చి సమస్యలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ జోనల్ సిటీ ప్లానర్ శ్రీనివాస్‌యాదవ్, హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, హెచ్‌ఎం గీత, అధికారులు డీఈ కనకయ్య, ఏఈ దీపక్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, టీపీఎస్ అక్బర్, కాలనీవాసులు పాల్గొన్నారు.


జోనల్ కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న రాక్‌టౌన్ కాలనీ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి


యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

యూజీడీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

చంపాపేట, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని అంబేడ్కర్‌వాడలో జీహెచ్‌ఎంసీ నిధులు రూ.9లక్షలతో చేపట్టనున్న యూజీడీ నిర్మాణ పనులకు కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నట్లు అన్నారు. యూజీడీ నిర్మాణ పనులు పూర్తి అయిన వెంటనే సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. యూజీడీ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి, జలమండలి మేనేజర్ రమ్యభారతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాములు, రాజేందర్, షబ్బీర్, జీహెచ్‌ఎంసీ ఏఈ సురేష్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, అంజి, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.


వీరన్నగుట్టపై శివరాత్రి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

వీరన్నగుట్టలో శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

హయత్‌నగర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): శివరాత్రిని పురస్కరించుకుని మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ఏరియాలోని వీరన్నగుట్ట వద్ద జరుగుతున్న ఏర్పాట్లను కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పరిశీలించారు. శివరాత్రి సందర్భంగా ప్రతి సంవత్సరం ఇక్కడికి పెద్దఎత్తున శివభక్తులు హాజరై భద్రకాళీ సమేత రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని తరిస్తారు. గత సంవత్సరం కంటే ఈ సారి భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున పెద్ద ఎత్తున ఏర్పాట్లను చేస్తున్నారు. స్థానిక కాలనీ వాసులు, ఆలయ ధర్మకర్తలతో కలిసి ఆలయం చుట్టు తిరిగి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు. గుట్ట పైకి వాహనాలు ఎక్కే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో శివదీక్ష స్వాములు, స్థానిక కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా అంజన్న ఆలయ వార్షికోత్సవం

సరూర్‌నగర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ బాలాపూర్‌లోని సామల పాపిరెడ్డి గార్డెన్స్‌లో గల అభయాంజనేయస్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా శనివారం నాటి ప్రత్యేక ఆధ్యాత్మిక, పూజా కార్యక్రమాల్లో ఆలయ వ్యవస్థాపకుడు సామల రంగారెడ్డితో కలిసి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం శ్రీరాములుయాదవ్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావన మనస్సుకు ప్రశాంతతను అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, నవారు శ్రీనివాస్‌రెడ్డి, గుండె గణేశ్‌బాబు, కొంతం సంపత్‌రెడ్డి, క్యారగారి అరవింద్, పన్నాల స్వీకృత్‌రెడ్డి, గడ్డం మధుతేజ, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.


బాలాపూర్ హనుమాన్ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న శ్రీరాములుయాదవ్

జ్ఞాన సరస్వతీదేవి విగ్రహావిష్కరణ

చంపాపేట, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కంచన్‌బాగ్ మిధానీ టౌన్‌షిప్‌లోని బీడీపీ స్కూల్‌లో శనివారం జ్ఞాన సరస్వతీదేవి విగ్రహాన్ని పాఠశాల చైర్మన్ గౌరీ శంకర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. విగ్రహదాత ప్రముఖ వ్యాపారవేత్త ఉడుగు రవికుమార్ మానస దంపతులు, విద్యార్థులు విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాలలో విగ్రహావిష్కరణ కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గౌరీశంకర్‌రావు, డీపీపీ పాఠశాల ఏఆర్ఓ ఆనందవల్లి, పాఠశాల హెచ్‌ఎం వీఎస్ ప్రశాంత్, ఎల్‌ఎంసీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరలోనే బడంగ్‌పేట్‌లో 50 పడకల ఆస్పత్రి : ఎమ్మెల్యే సబిత

● అల్మాస్‌గూడలో బస్తీ దవాఖాన ప్రారంభం

సరూర్‌నగర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్‌లో త్వరలోనే 50 పడకల ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురానున్నట్టు మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి వెల్లడించారు. సదరు ఆస్పత్రి నిర్మాణం పనులు చురుకుగా కొనసాగుతున్నాయని, స్థానికుల సౌకర్యార్థం బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ సహకారంతో ఆస్పత్రిని మంజూరు చేయించామని ఆమె పేర్కొన్నారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ 25వ డివిజన్‌లో గల రాజీవ్ గృహకల్పలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో మహేశ్వరం నియోజకవర్గానికి 10 బస్తీ దవాఖానాలు, 8అర్బన్ హెల్త్ సెంటర్లు మంజూరు చేయించామని చెప్పారు. అప్పట్లో మంజూరైన ప్రత్యేక నిధులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసి, అభివృద్ధిని అడ్డుకుంటున్నదని ఆమె ఆరోపించారు. కార్యక్రమంలో రంగారెడ్డి డీఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా బస్తీ దవాఖానా ఇన్‌చార్జి వినోద్‌కుమార్, బాలాపూర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బాలమణి, డాక్టర్లు గీత, గాయత్రి, అఖిల, డీపీఎంవో డాక్టర్ అక్రమ్, మాజీ కార్పొరేటర్లు ముత్యాల లలితాకృష్ణ, సంరెడ్డి స్వప్నావెంకట్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, సూర్లగంటి అర్జున్, రామిడి కవితారాంరెడ్డి, బోయపల్లి దీపికాశేఖర్‌రెడ్డి, పెద్దబావి శోభాఆనంద్‌రెడ్డి, రామిడి రాంరెడ్డి పాల్గొన్నారు.



అల్మాస్‌గూడలో బస్తీ దవాఖానను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

డ్వాక్రా గది ప్రారంభం

అల్మాస్‌గూడ 25వ డివిజన్‌లో గల డ్వాక్రా భవనంలో అదనంగా నిర్మించిన గదిని ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్లు, నాయకులు, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సూరంచెరువులో ఆక్రమణలు తొలగించిన హైడ్రా

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ మున్సిపాలిటీలోని సూరం చెరువులో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. సూరంచెరువు మొత్తం విస్తీర్ణం దాదాపు 60ఎకరాలు కాగా.. సుమారు 15 ఎకరాలను స్థానికంగా లేఅవుట్లు వేస్తున్న వారు కబ్జా చేశారు. చెరువులోకి జరిగి చుట్టూ ప్రహరీ నిర్మించారు. డ్రైనేజీ పైపులైన్లు కూడా వేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు చెరువులోకి జరిగి ప్రహరీ నిర్మించినట్లు నిర్ధారణ కావడంతో శనివారం హైడ్రా ప్రహరీని కూల్చివేసింది.


సూరంచెరువు వద్ద ఏర్పాటుచేసిన ప్రహరీని కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు, సిబ్బంది

మంద కృష్ణమాదిగకు సన్మానం

కొత్తపేట, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణమాదిగకు ప్రతిష్టాత్మక పద్మశ్రీ అవార్డు రావడంతో శనివారం బీఆర్‌ఎస్ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి మల్లెపాక యాదగిరి తదితర ఎల్బీనగర్ నాయకులు ఆయన స్వగృహంలో ఆయనను కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, అనిల్, ఏర్పుల యాదయ్య, అనిత, నిర్మల, విజయలక్ష్మి పాల్గొన్నారు.

17 నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠం ఆదిపరాశక్తి ప్రత్యంగిరా పరమేశ్వరిదేవి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 17నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. శనివారం బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠాధిపతులు జగద్గురు సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి దివ్యాశీస్సులతో జరుగు వార్షిక బ్రహ్మోత్సవాలలో ప్రతి రోజు 18రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, హోమాలు, మహిళలచే కుంకుమార్చన, మహానక్షత్ర హారతులు ఉంటాయన్నారు. చివరి రోజైన ఫిబ్రవరి 19న సాయంత్రం పల్లకీసేవ ఉంటుందని ఆయన తెలిపారు. కుర్తాళ సిద్ధేశ్వరీ పీఠ ఆస్థాన పండితులు బ్రహ్మశ్రీ మాచవోలు రమేష్‌శర్మ నిర్వహణలో జరుగనున్న కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మునిపల్లె సువర్ణలత, విఠల్‌శర్మ, అన్నపూర్ణ, జయప్రద, కామేశ్వరి, ఉష, నీలిమ, హేమ, శకుంతల, సరిత, హరిత పాల్గొన్నారు.


ఆలయ బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్

ప్రకటన ఇచ్చారు.. వెబ్‌సైట్ మూసేశారు

● మీ సేవ కేంద్రాల వద్ద కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుదారుల పడిగాపులు

వనస్థలిపురం/అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డుల కోసం మీ సేవ కేంద్రంలో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని శుక్రవారం సూచించింది. దీంతో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకునేందుకు శనివారం ఉదయం నుంచే మీ సేవ కేంద్రాలకు ప్రజలు క్యూ కట్టారు. ప్రభుత్వ వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడంతో మీ సేవ కేంద్రాల వద్ద ప్రజలు పడిగాపులు కాశారు. చివరకు నిరాశతో వెనుదిరిగారు. వనస్థలిపురం, కర్మన్‌ఘాట్, సరూర్‌నగర్, ఎల్బీనగర్, అబ్దుల్లాపూర్‌మెట్, పెద్దఅంబర్‌పేట్‌లోని మీసేవ కేంద్రాల్లో కొత్తగా రేషన్ కార్డులు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన ప్రజలకు నిరాశే మిగిలింది. శనివారం ఉదయం మీసేవ కేంద్రం సిబ్బంది సివిల్ సప్లై పోర్టల్ సైట్ ఎంతకీ ఓపెన్ కాలేదు. దీంతో మీసేవ సిబ్బంది చేసేది లేక మీసేవ కేంద్రం వద్ద రేషన్ కార్డుల దరఖాస్తులు స్వీకరించడం లేదని నోటీసు అంటించారు. సైట్ ఓపెన్ కాకపోవడంతో దరఖాస్తు చేసుకోకుండానే ప్రజలు వెనుదిరిగారు. దరఖాస్తు చేసుకోమని చెప్పాల్సిన అవసరం ఏమి వచ్చిందని ప్రజలు ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు. రేషన్‌కార్డులు ఇవ్వలేకపోతే దరఖాస్తు చేసుకోమని ఎందుకు ప్రకటించారని ప్రశ్నించారు. ఇదే విషయంపై మీసేవ సిబ్బందిని వివరణ అడగగా నిన్న మధ్యాహ్నం 12గంటల వరకు సంబంధిత సైట్ అందుబాటులో ఉన్నప్పటికీ శనివారం సైట్ బంద్ అయిందని నిర్వాహకులు తెలిపారు. సివిల్ సప్లయ్ అధికారుల నుంచి కూడా తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని నిర్వాహకులు పేర్కొన్నారు. సోమ, మంగళవారంలో దరఖాస్తులకు తిరిగి అవకాశం కల్పించవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు. ఇదే విషయంపై ఉన్నతాధికారులను సంప్రదించగా ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన పూర్తైన తర్వాతే నూతన రేషన్‌కార్డుల దరఖాస్తులను మీసేవ సెంటర్ల నుంచి స్వీకరిస్తామని తెలిపారని వారు పేర్కొన్నారు.



మీసేవ నుంచి వెనుతిరుగుతున్న దరఖాస్తుదారులు

విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలి

● టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపూడి

కొత్తపేట, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): చిన్నప్పుడే విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపూడి తెలిపారు. శనివారం హయత్‌నగర్ వివేకానంద హైస్కూల్ నుంచి 40మంది చిన్నారులు రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. రహదారి భద్రత అవగాహనలో భాగంగా వారికి లెక్చర్ హాల్‌లో వీడియోలు, రైమ్స్ ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు. చిన్నారులు పార్కులో హెల్మెట్లు పెట్టుకుని సైకిళ్లపై తిరుగుతూ సందడి చేశారు. కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎస్ఐ నర్సింహారావు, పీసీ రమేష్ సాధారణ ప్రజలకూ, డ్రైవర్లకూ రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతలపై అవగాహన కల్పించారన్నారు. దేశ్‌ముఖిలో మూడు, పోచంపల్లి పిల్లాయిపల్లిలో రెండు ప్రభుత్వ పాఠశాలలు, బాటసింగారం జడ్‌హెచ్‌ఎస్, అనాజ్‌పూర్ రోడ్, ఎల్బీనగర్ కామినేని క్రాస్‌రోడ్స్, ఆర్టీసీకాలనీ రోడ్ తదితర 10 ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనలను వివరించారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


ట్రాఫిక్ పార్కులో హెల్మెట్ పెట్టుకుని సైకిళ్లు తొక్కుతున్న విద్యార్థులు

39 మంది మద్యంప్రియులకు డీడీ కౌన్సెలింగ్

వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిలో 39మంది మద్యంప్రియులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో చిల్డ్రన్‌పార్కు లెక్చర్‌హాల్‌లో శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. విశ్రాంత ఇన్‌స్పెక్టర్ అమరవర్ధన్‌రెడ్డి, ఎస్‌టీపీ అల్లూరయ్య తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట్‌లో చైన్‌స్నాచర్ అరెస్టు

● 20గ్రాముల బంగారు గొలుసు, బైకు స్వాధీనం

సరూర్‌నగర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల మీర్‌పేట్‌లో వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కుని పారిపోయిన దొంగను పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలోని మామిడికుదురు గ్రామానికి చెందిన జల్లి ప్రేమ్‌కుమార్ అలియాస్ ప్రేమ్ అలియాస్ సన్నీ(28) బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గాంధీనగర్ సమీపంలో గల శ్రీనిలయటౌన్‌షిప్ కాలనీలో అద్దెకు ఉంటూ పెస్ట్ కంట్రోల్ స్ప్రే(చెదల నివారణ మందు పిచికారీ) చేస్తున్నాడు. చెడు అలవాట్లకు బానిసైన ప్రేమ్ సులువుగా డబ్బు సంపాదించడానికిగాను చోరీ బాట ఎంచుకున్నాడు. ఈ క్రమంలో ఈనెల 3వ తేదీ మధ్యాహ్నం మీర్‌పేట్‌లోని టీఎస్ఆర్‌నగర్ కాలనీలో గల ఓ దుస్తుల/గాజుల షాపుకు వెళ్లి షాపులో ఒంటరిగా ఉన్న ఉడుతల యాదమ్మ అనే వృద్ధురాలి మెడలోని బంగారు మంగళసూత్రం తెంపుకుని ఉడాయించాడు. బాధితురాలి చెయిన్‌ను గట్టిగా పట్టుకోవడంతో సగం భాగం ఆమె చేతిలోనే ఉండిపోగా మిగతా సగం నిందితుడు తస్కరించుకుపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన మీర్‌పేట్ పోలీసులు సీసీటీవీ ఫుటేజీలు, ఇతర సాంకేతిక ఆధారాలతో నిందితుడు ప్రేమ్‌ను శనివారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. అతడి నుంచి 20 గ్రాముల బంగారు గొలుసు, ఒక ప్యాషన్ ప్లస్ బైకు(మొత్తం సుమారు రూ.2లక్షలు) స్వాధీనం చేసుకున్నట్టు ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే రాష్ట్రాలు అభివృద్ధి

● బీజేపీ రాష్ట్ర నేత అందెల శ్రీరాములుయాదవ్

సరూర్‌నగర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో దాదాపు రెండున్నర దశాబ్దాల తర్వాత బీజేపీ ప్రభుత్వం ఏర్పడడం చారిత్రాత్మకమని, ప్రజలు డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమని విశ్వసిస్తున్నారని, దానికి ఢిల్లీ ఫలితాలే ప్రత్యక్ష ఉదాహరణ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. ఢిల్లీలో బీజేపీ ఘన విజయం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం నాదర్‌గుల్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ, కేజ్రీవాల్ హామీలను ప్రజలు తిరస్కరించారని, అవినీతి, కుంభకోణాల్లో కూరుకుపోయిన ఆ రెండు పార్టీలకు ఓటర్లు గట్టి గుణపాఠం చెప్పారని వ్యాఖ్యానించారు.


బీఎన్‌రెడ్డినగర్‌లో విజయోత్సవ సంబరాలలో కార్పొరేటర్ లచ్చిరెడ్డి

బడంగ్‌పేట్‌లో నేతల సంబరాలు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఆప్ ఘోరంగా ఓటమి పాలై బీజేపీ విజయదుందుభి మోగించడం పట్ల బీజేపీ శ్రేణులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో శనివారం బడంగ్‌పేట్‌లో పార్టీ క్లస్టర్-1,2 అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా, కార్పొరేషన్ నాయకులు నడికుడ యాదగిరి, గుర్రం మల్లారెడ్డి, ఏనుగు రాంరెడ్డి, రేసు నర్సింహారెడ్డి, కొంతం సంపత్‌రెడ్డి, చిత్రం శ్రీనివాస్, నవారు శ్రీనివాస్‌రెడ్డి, కుంటి భాస్కర్, మాజీ కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, గూడెపు ఇంద్రసేన, నిమ్మల సునీతాశ్రీకాంత్‌గౌడ్, గౌర రమాదేవిశ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆప్‌ను ఊడ్చేసిన ఢిల్లీ ప్రజలు : కార్పొరేటర్ శ్రీవాణి

ఎల్‌బీనగర్ : ఢిల్లీ ఎన్నికల్లో ప్రజలు ఆమ్ ఆద్మీ పార్టీని ఊడ్చేశారని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయభేరి మోగించడంతో సరూర్‌నగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు మిట్టపల్లి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ అధ్యక్షుడు పున్నా గోవర్ధన్, సీనియర్ నాయకులు కట్ట జైన్‌బాబు, కాటం రాజు, కబీర్‌దాస్, నర్సింహమూర్తి, నందకుమార్, పుణ భాస్కర్, దిలీప్, శ్రీకాంత్, కట్ట రాజేష్, ప్రదీప్, కోటి, వినయ్, స్టీవెన్ పాల్గొన్నారు.

వనస్థలిపురం : ఢిల్లీలో బీజేపీ గెలుపొందిన నేపథ్యంలో బీఎన్‌రెడ్డినగర్‌లో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పటాసులు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.



బీజేపీ విజయోత్సవాల్లో కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్, కార్యకర్తలు

చాదర్‌ఘాట్ : ఢిల్లీ పీఠంపై కాషాయజెండా రెపరెపలాడడం దేశ ప్రజలకే గర్వకారణమని బీజేపీ రాష్ట్ర నాయకుడు మాజీ డిప్యూటీ మేయర్, భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, రాష్ట్ర మీడియా సెల్ కన్వీనర్ లింగాల హరిగౌడ్, మూసారాంబాగ్ డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్‌కుమార్ పటేల్ అన్నారు. ఢిల్లీలో బీజేపీ అధికారంలోకి రావడం పట్ల వారు హర్షం ప్రకటిస్తూ శనివారం సాయంత్రం పార్టీ కార్యకర్తలతో సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆవుల ప్రవీణ్‌యాదవ్, కొట్టం వెంకట్‌రెడ్డి, యాదగిరి సురేందర్, కొంగర ప్రవీణ్, చందు, బకరం యాదగిరి, మైలపాక రాంచందర్ పాల్గొన్నారు.